వరహాల గెడ్డ..

జిల్లాకేంద్రంలో కీలకమైన వరహాలగెడ్డ ఆక్రమణలకు గురైనా.. ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించకపోవడం దారుణం. వరహాలగెడ్డ ప్రవాహం నిలిచిపోయే విధంగా నిర్మాణాలు జరుగుతున్నా.. ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూశాఖలు కనీస చర్యలు తీసుకోకపోవడంపై పట్టణవాసులు పెదవి విరుస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఇటీవల ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. తక్షణమే వరహాల గెడ్డపై ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. దీంతో అధికారులు స్పందించి.. తొలగింపు చర్యలు చేపట్టారు.



బిల్లబంద వద్ద రహదారులను నిర్మిస్తున్న దృశ్యం



- ఆక్రమణలకు అడ్డాగా తయారైన జిల్లాకేంద్రం
- గత వైసీపీ సర్కారు హయాంలో భారీగా కబ్జాలు
- చెరువులు, బందలను కప్పేసి.. వెంచర్లు మార్చేసి..
- వైసీపీ నేతల అండతో రెచ్చిపోయిన అక్రమార్కులు
- రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు హస్తగతం
- ఐదేళ్లూ.. ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వైనం
- అయినా వారిపై చర్యలు చేపట్టని అధికారులు
- నూతన ప్రభుత్వం స్పందించాలని ప్రజల విన్నపం

అధికారం ఉందికదాని..

బరితెగించారు!

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్ల వైసీపీ సర్కారు హయాంలో పార్వతీపురం పట్టణం కబ్జాలకు అడ్డాగా మారింది. విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. జిల్లాకేంద్రంగా మారిన తర్వాత భూముల ధరలు అమాంతం పెరగడంతో.. ఆక్రమణదారులు మరింత రెచ్చిపోయారు. పట్టణంలో చెరువులు, బందలను యథేచ్ఛగా ఆక్రమించారు. నిబంధలను తుంగలో తొక్కి.. రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటు చేశారు. అప్పట్లో కొంతమంది వైసీపీ నాయకుల అండదండలతో తమ దందా కొనసాగించారు. క్షేత్రస్థాయిలో కొందరు రెవెన్యూ శాఖాధికారులు కూడా సహకరించడంతో జిల్లాకేంద్రం కబ్జాలకు కేరాఫ్‌గా నిలిచింది. దీనిపై ఆరోపణలు వెల్లువెత్తినా.. గతంలో అధికారులు పట్టించుకున్న దాఖలాలులేవు. పైగా ఫిర్యాదు చేసిన ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలకు దిగారు. మొత్తంగా వైసీపీ సర్కారు హయాంలో రెవెన్యూతో పాటు ఇరిగేషన్‌శాఖ అధికారులు కూడా పార్వతీపురంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడడంలో పూర్తిగా విఫలమయ్యారు. ప్రస్తుతం జిల్లాకేంద్రంలో చెరువులు, బందల పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



వరహాల గెడ్డపై ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశిస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర (ఫైల్)

బిల్ల బంద..

పార్వతీపురం పట్టణంలో ఉన్న బిల్లబందను పూర్తిగా కప్పేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. గత ఐదేళ్లలో ఇష్టానుసారంగా రికార్డులు మార్చేసి పాస్‌పుస్తకాలు సృష్టించారు. యథేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమించి.. రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్పు చేసినా.. సంబంధిత అధికారులు స్పందించక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బందలను పరిరక్షించాల్సిన వారే నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరించడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు ఆక్రమణదారులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశమవుతోంది. అసలు ఎవరి పేరున ఆ బంద నమోదైంది.. రియల్ ఎస్టేట్‌కు ఎవరు అనుమతులు ఇచ్చారన్నది రెవెన్యూ ఉన్నతాధికారులు నిగ్గు తేల్చాల్సి ఉంది. పట్టణంలో బందల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం..

పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అయితే బీసీగా నమోదు చేస్తూ పట్టాదారుపాస్ పుస్తకాలు ఎలా జారీ చేశారు?.. పట్టణంలో ఇతర చెరువుల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలి. ఆక్రమణలదారుల నుంచి ప్రభుత్వానికి చెందిన భూములు, చెరువులను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలి. దీనిపై కలెక్టర్‌తో పాటు సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేస్తాం.

-ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం

చెరువులను కాపాడాలి..

చెరువులు, బందలను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులతో పాటు ప్రతి ఒక్కరిపైనా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. పార్వతీపురంలో చెరువులు, బందల పరిస్థితిపై విచారణ చేపట్టాలి. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి.

-దాలినాయుడు, చెరువుల పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు, పార్వతీపురం

విచారణ చేయాలి..

బందలను కప్పేసి రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మార్చిన అంశంపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలి. బిల్ల బంద ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోలేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి. ప్రభుత్వానికి చెందిన చెరువులు, బందలను స్వాధీనం చేసుకోవాలి.

-సన్యాసిరావు, సీపీఎం నాయకుడు, పార్వతీపురం

ఆక్రమిస్తే కఠిన చర్యలు..

చెరువులతో పాటు ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బిల్లబంద విషయంలో త్వరలోనే విచారణ చేపట్టి.. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

-హేమలత, ఆర్డీవో, పార్వతీపురం మన్యం

లంకెల చెరువు..

పార్వతీపురం మండలం బాలగొడబ రెవెన్యూ పరిధిలో ఉన్న లంకెల చెరువు కూడా కబ్జాకు గురైంది. గత వైసీపీ సర్కారు హయాంలో ఈ చెరువు గర్భం పూర్తిగా ఆక్రమణలకు గురైంది. దీంతో ఆయకట్టు దారులు సాగునీటికి కటకటలాడాల్సి వస్తోంది. దీనిపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు.

ఇదెలా సాధ్యం?

పార్వతీపురంలో ఒక మాజీ ప్రజా ప్రతినిధి సామాజిక వర్గాన్ని మార్చేసి.. పట్టాదారు పాస్ పుస్తకాలు ఎలా జారీ చేశారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అంటే గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రెవెన్యూ అధికారులు ఏ విధంగా పనిచేశారన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. బహిరంగంగా అనేక తప్పులు కనిపిస్తున్న నేపథ్యంలో రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు స్పందించి.. తగు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



పూజలందుకున్న స్వామివారు

తోటపల్లిలో ఏకాదశి పూజలు

గరుగుబిల్లి, జూలై 17 : ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల్లో బుధవారం శయన ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయ దేవాలయాల్లో ముందుగా ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు ఆరాధనలు జరిపారు. అనంతరం విశేష కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి రావివలసతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎవరికీ అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ అవసరమైన చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా జిల్లాలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు, రామ, కృష్ణ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. అంతటా హరినామస్మరణ మార్మోగింది. భక్తులు వేకువజామునే లేచి పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు పయనమయ్యారు. స్వామి దర్శనానికి బారులుతీరారు. ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

ముగిసిన రథయాత్ర

- పాలకొండలో ప్రధాన ఆలయానికి జగన్నాథుడు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

పాలకొండ: పట్టణంలో జగన్నాథస్వామి రథోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్వామివారు ప్రధాన దేవాలయానికి చేరుకున్నారు. తొలుత రథంపై ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు మఠం విశ్వనాథదాసు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన దేవాలయం వరక భక్తులు రథాన్ని ఉత్సాహంగా లాగారు. కాగా చివరి రోజు యాత్రకు అధిక సంఖ్యలో భక్తజనం తరలివచ్చారు. పట్టణంతో పాటు సమీప గ్రామాలతో పాటు ఒడిశా నుంచి భారీగా ప్రజలు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. యాత్ర జరిగిన ప్రదేశంలో మందుగుండు సామగ్రి కాల్చి.. యువకులు సందడి చేశారు. డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ, ఎస్ఐలు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. యాత్రకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో సర్వేశ్వరరావు ముందస్తు చర్యలు తీసుకున్నారు.



రథంపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఏవోబీలో మూడు లారీలు ఢీ

- ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ జాం



సాలూరు రూరల్,జూలై 17: ఏవోబీ జాతీయ రహదారి 26 ఘాట్‌రోడ్డులో బుధవారం మూడు లారీలు ఢీ కొన్నాయి. దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఏపీ ఒడిశా బోర్డర్‌కు సమీపంలో సాలూరుకు చెందిన లారీని ఒడిశా రాష్ట్రం జైపూర్ నుంచి వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ఘటన జరిగిన కాసేపటికే మరో లారీ సైతం వెనుక నుంచి వాటిని ఢీ కొట్టింది. అయితే ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ఘటనతో ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాల నిలిచిపోయాయి. లారీ కార్మికుల సహకారంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది. యథావిధిగా వాహనాల రాకపోకలు సాగాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

పారాది బ్రిడ్జిపై కసరత్తు

- 20 రోజుల్లో పనులు ప్రారంభించే అవకాశం
- పెరిగిన నిర్మాణ వ్యయం
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం

(బొబ్బిలి, జూలై 17)

పారాది వద్ద వేగావతి నదిపై స్టేట్‌హైవేలో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులను మరో 20 రోజుల్లో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పెరిగిన అంచనా వ్యయంతో ఈ పనులను చేపట్టనున్నారు. ఆరేళ్ల క్రితం బ్రిడ్జి పనులకు టెండర్లు ఖరారు అయిన సంగతి తెలిసిందే. ఆ కాంట్రాక్టర్‌కు పాత బకాయిలు కోట్లాది రూపాయలు పెండింగ్‌లో ఉండిపోవడంతో పనులు కొనసాగించేందుకు సాహసం చేయలేకపోయారు. ఫలితంగా ఆరేళ్లుగా కొత్త బ్రిడ్జి నిర్మాణం కల నెరవేరకుండా పోయింది. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ మంచి రోజులొచ్చాయి. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు భరోసా ఇస్తున్నట్లు సమాచారం. బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే మొదలు కానుంది. 12 శాతం ఉండే జీఎస్టీ పెరగడంతో బ్రిడ్జి నిర్మాణ వ్యయం రూ.10.90 కోట్ల నుంచి రూ.13.40 కోట్లకు పెరిగింది. వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర తాత్సారం జరగడంతో ప్రజాధనం వృథా అయింది.

● ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలను కలుపుతూ 1935లో బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించిన బ్రిడ్జి పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. దీని స్థానంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.10.90 కోట్లతో కొత్తబ్రిడ్జికి టెండర్లు పిలిచి శంకుస్థాపన చేశారు. ఈ లోపుగా ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మరోసారి శంకు స్థాపన చేశారు. పనిమాత్రం చేపట్టలేదు. అంతలో బ్రిడ్జి ఒక పక్కకు కిందికి కుంగిపోయింది. దీంతో భారీ వాహ నాల రాకపోకలను నిలుపుదల చేసి బ్రిడ్జికి సపోర్టుగా తాత్కాలికంగా గడ్డర్లు ఏర్పాటు చేశారు. తేలికపాటి వాహనాలు వెళ్లడానికి మాత్రమే అనుమతి ఇచ్చారు. దీనివల్ల బొబ్బిలి నుంచి రామభద్రపురం మీదుగా విశాఖ, విజయనగరం ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వాహనాలను దారిమళ్లించిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోడ్లన్నీ ఛిద్రమైపోతున్నాయని ఆయా ప్రాంతాల వారు గగ్గోలు పెట్టారు. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా డైవర్షన్ రోడ్డు (కాజ్‌వే) మంజూరు చేసింది. అది పటిష్ఠంగా లేకపోవడంతో కొద్దిపాటి వరదనీటికే కొట్టుకుపోయింది. ఇందుకోసం ఖర్చు చేసిన నిధులు గంగలో కలిసిపోయాయి. గత నెలలో ఈ సమస్య రెండుసార్లు ఉత్పన్న మైంది. ఇక మంజూరైన కొత్త బ్రిడ్జిని యుద్ధప్రాతిపదికన నిర్మించడం ఒక్కటే ఇందుకు పరిష్కారమార్గం. అన్ని వర్గాల ప్రజల ఒత్తిడి, వాహన దారుల డిమాండ్ మేరకు కొత్తబ్రిడ్జి నిర్మాణ పనులను 20 రోజుల్లో ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.



బ్రిడ్జి కుంగిన స్థలం

20 రోజుల్లో బ్రిడ్జి పనులు ప్రారంభం

పారాది వద్ద వేగావతి నదిపై కొత్త వంతెన నిర్మాణం 20 రోజుల్లోగా ప్రారంభమవుతుంది. ఆరేళ్ల కిందట టెండరు ఖరారైన కాంట్రాక్టర్‌తోనే ఈ పనులను చేయించేందుకు ఒప్పందం కుది రింది. ఉన్నత స్థాయి అధికారులు సమావేశమై కార్యాచరణను రూపొందించారు. పనులు ప్రారంభమైతే త్వరితగతిన వంతెన పూర్తవుతుంది.

- బీవీకే రాజు, జేఈ, ఆర్‌అండ్‌బీ



పారాది బ్రిడ్జి





అర్ధాంతరంగా నిలిచిపోయిన గృహ నిర్మాణాలు

ఇళ్ల బిల్లులకు మోక్షం!

- జాబితాలు సిద్ధం చేస్తున్న గృహ నిర్మాణశాఖ
- జిల్లాలో 1,12,615 మంది లబ్ధిదారులు
- పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- నూతన ప్రభుత్వంపై ఆశలు

కొమరాడ: జిల్లాలో గృహ నిర్మాణ లబ్ధిదారులు బిల్లుల మంజూరు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం, ఇందిరమ్మ, పీఎంఏవై పథకాల ద్వారా ఇళ్లు మంజూరైన వారికి గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చెల్లింపులు చేయలేదు. దీంతో ఐదేళ్లుగా వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ దశల్లో గృహ నిర్మాణాలు కూడా నిలిచిపోయాయి. అయినప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం కనికరించలేదు.. ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. దీంతో వారంతా టీడీపీ కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. వాస్తవంగా ఇందిరమ్మ ఫేజ్-1,2,3, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాల కింద జిల్లా వ్యాప్తంగా 1,12615 గృహాలు మంజూరయ్యాయి. దీంతో సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో ఎంతోమంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో వారికి కష్టాలు మొదలయ్యాయి. బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో ఇళ్ల నిర్మాణలకు బ్రేక్ పడింది. అప్పట్లో లబ్ధిదారులు పలుమార్లు వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. అయితే తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం పెండింగ్ ఇళ్ల బిల్లులు చెల్లింపుపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఇళ్లకు సంబంధించి పూర్తిస్థాయి సమాచారం గృహ నిర్మాణశాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగానే గృహ నిర్మాణశాఖ పెండింగ్ బిల్లుల జాబితాను రూపొందిస్తున్నట్లు సమాచారం. అప్పట్లో ఒక్కో ఇంటికి రూ. 1.50 లక్షలు కేటాయించారు. సిమెంటు, నగదు కొంతమేర చెల్లించారు. ఇప్పుడు మిగిలిన మొత్తాన్ని కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందన్న ఆశతో లబ్ధిదారులు ఉన్నారు. సాలూరు నియోజకవర్గంలో 27,156, పాలకొండలో 27,757, కురుపాంలో 34,446, పార్వతీపురం నియోజకవర్గంలో 23,256 చొప్పున గృహ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

జాబితాలు తయారు చేస్తున్నాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో మంజూరైన గృహ నిర్మాణాల పెండింగ్ బిల్లుల జాబితాను మండలాల వారీగా సిద్ధం చేస్తున్నాం. వాటిని జిల్లా అధికారులకు అందజేయనున్నాం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు బిల్లుల చెల్లింపు ఉంటుంది.

-పి.మోహన్‌రావు, డీఈ, గృహ నిర్మాణ శాఖ, కురుపాం

DIKSUCHI
దిక్సూచి

లా కోర్సులలో ప్రవేశానికి క్లాట్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ఛాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

అండర్ గ్రాడ్యుయేట్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.


యూజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; కరెంట్ అఫైర్స్-జనరల్ నాలెడ్జ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లీగల్ రీజనింగ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌లో 10 నుంచి 14 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు. కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

పోస్ట్ గ్రాడ్యుయేట్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు. కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

ఓయూలో పార్ట్ టైమ్ పీజీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యూసీఈ)-పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీఈఈపీ) కింద ఎంఈ/ఎంటెక్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయో మెడికల్, మైనింగ్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఇంజనీరింగ్ విభాగంలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు.

అర్హతలు: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. జూన్ 30 నాటికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్) పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగానికి(బీఈ/బీటెక్)(బయో మెడికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ ఈఐఈ/ ఈసీఈ/బయోటెక్నాలజీ/మెడికల్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/మెడికల్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/మెడికల్ ఫిజిక్స్/బయో ఫిజిక్స్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయో మెడికల్ ఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మైనింగ్ ఇంజనీరింగ్ విభాగానికి మైనింగ్ అండ్ మెషినరీ ఇంజనీరింగ్/మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** www.uceou.edu

డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** ipweindia.org.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/1ZB524Mలో చదవండి.



ప్రేక్షకులు గుర్తుపెట్టుకునే సినిమా



ఇటీవలే 'ఓమ్ భీమ్ బుష్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు ప్రియదర్శి. ఆయన, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరి' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా రేపు విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు చాలా బాగా నచ్చింది. స్ర్కిప్ట్‌పై పూర్తి నమ్మకం ఉంది. సినిమాకు ఈ టైటిల్‌ను చాలా ప్రేమతో పెట్టాం. కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ఈ సినిమా.. రిలేషన్‌షిప్‌లో ఉన్న వారితో పాటు అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుంది. ఇందులో నా ప్రపంచం, నభా ప్రపంచం చాలా వేరుగా ఉంటాయి. భిన్న ధ్రువాలైన మా ఇద్దరి మధ్య సీరియస్‌గా జరిగే సంఘటనలతో సాగే సన్నివేశాలను ప్రేక్షకులు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు. స్ర్కీన్‌ప్లే చాలా వైవిధ్యంగా ఉంటుంది. 'డార్లింగ్' సినిమాను అందరూ చాలా కాలం గుర్తుపెట్టుకుంటారు" అని ప్రియదర్శి అన్నారు.

ఆగస్టులో భవనమ్ విడుదల



ప్రతిష్ఠాత్మక నిర్మాణసంస్థ సూపర్‌గుడ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ఉపశీర్షిక. ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్‌కుమార్, వీరేంద్ర సిర్వీ నిర్మిస్తున్నారు. సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన తారాగణం. బాలాచారి కూరెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం మేకర్స్ 'భవనమ్' విడుదల తేదీని ప్రకటించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రేక్షకుల్ని భయపెట్టడంతో పాటు మంచి హాస్యంతో అలరిస్తుందని చిత్ర బృందం తెలిపింది. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్‌రెడ్డి, ఎడిటర్: ఎన్టీఆర్.

'ఏం చేద్దామంటావ్ మరి'...
కల్లు కాంపౌండ్ పాటలో కేసీఆర్ ఊతపదం

- దర్శకుడు పూరి జగన్నాథ్‌పై కేసు నమోదు



రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా నుంచి ఇటీవలే విడుదలైన 'మార్ ముంత చోడ్ చింత' అనే పాటలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు వాయిస్‌ను ఉపయోగించడంపై బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు అభ్యంతరం తెలుపుతున్నారు. కల్లు కాంపౌండ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ గీతంలో 'ఏం చేద్దామంటావ్ మరి' అనే కేసీఆర్ పాపులర్ డైలాగ్‌ను రెండుసార్లు ఉపయోగించారు. వెంటనే పాట నుంచి ఆ హుక్‌లైన్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఎం. రజితారెడ్డి, జీ. సతీష్‌కుమార్ బుధవారం ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 'పదేళ్లు తెలంగాణ రాష్ర్టానికి ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ వాయిస్‌ను కల్లు కాంపౌండ్‌లో చిత్రీకరించిన ఐటమ్ సాంగ్‌లో ఉపయోగించడం తప్పు, ఇది కేసీఆర్‌ను అవమానించడమే కాక తెలంగాణ ప్రజల మనోభావాలనూ దెబ్బతీసేలా ఉంది' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మా ప్రాంత యాస, భాష, మా నాయకుడిని కించపరిచినా సహించేది లేదు, అవసరమైతే పూరి జగన్నాథ్ ఇంటిని ముట్టడిస్తామ'ని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. పాట రచయిత కాసర్ల శ్యామ్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌పైనా సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై చిత్రబృందం ఇంతవరకూ స్పందించలేదు.

త్వరలోనే మీ ముందుకొస్తా



నటించిన అతికొద్ది చిత్రాలతోనే తన సూపర్ యాక్టింగ్‌తో.. మంచి టైమింగ్‌తో నటుడిగా స్పెషల్ ఇమేజ్ తెచ్చుకున్నారు నవీన్ పొలిశెట్టి. 2023లో విడుదలైన 'మిస్.శెట్టి, మిస్టర్ పొలిశెట్టి' చిత్రం తర్వాత ఆయన తెరపై కనిపించలేదు. ఈ విరామానికి గల కారణాన్ని ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు.

"నేను మీ అందరితో ఓ వ్యక్తిగత విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. నేను చేస్తున్న సినిమాల గురించి అప్‌డేట్స్ లేవని అందరూ అడుగుతున్నారు. దానికి కారణం ఇటీవలే జరిగిన బైక్ ప్రమాదంలో నా చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ గాయాల వల్లే నేను సినిమాలను అనుకున్న టైమ్‌కి మీ ముందుకు తీసుకురాలేకపోతున్నాను. ఈ విరామానికి నన్ను క్షమించండి. త్వరలోనే పూర్తిగా కోలుకుని మిమ్మల్ని తిరిగి ఎంటర్టైన్ చేస్తాను" అని పేర్కొన్నారు.

'సర్దార్-2' షూటింగులో స్టంట్‌మేన్ మృతి



తమిళ నటుడు కార్తీ హీరోగా నటిస్తున్న 'సర్దార్-2' చిత్రం షూటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. ఈ సినిమా కోసం ఒక ఫైట్ చిత్రీకరిస్తుండగా, 20 అడుగుల ఎత్తు నుంచి ఫైట్ ట్రైనర్ (స్టంట్‌మేన్) ఏళుమలై ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని ఆ చిత్ర నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ స్టూడియోలో మంగళవారం ఫైట్ మాస్టర్ సూపర్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో ఫైట్ రిహార్సల్ చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఏళుమలై కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నిర్మాత లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యంగానే ఉన్నా

ఆర్.నారాయణమూర్తి



ప్రజానటుడు ఆర్.నారాయణమూర్తి స్వల్ప అస్వస్థతతో బుధవారం నిమ్స్ అసుపత్రిలో చేరారు. ఆయనను ప్రత్యేక విభాగంలో ఉంచి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప అధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఉండటంతో హృద్రోగ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ పరీక్షలను వైద్యులు చేసి, ప్రమాదం ఏమీ లేదని నిర్ధారించారు. గ్యాస్ట్రిక్ సమస్య అయి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నారాయణమూర్తికి ఏమైందంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతుండడంతో 'నేను ఆరోగ్యంగా ఉన్నా. అభిమానులూ ఆందోళన చెందకండి. దేవుడి దయ వల్ల బాగానే ఉన్నా. పూర్తిగా కోలుకున్న తర్వాత అన్ని వివరాలూ వెల్లడిస్తా' అని ఓ ప్రకటనలో తెలిపారు నారాయణమూర్తి.



తన భర్త నికోలై సచ్‌దేవ్‌తో కలసి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు. 'హైదరాబాద్ నాకు సెకండ్ హోమ్.. మీరంతా నాకు చాలా సపోర్ట్ చేశారు. ఇక ముందు కూడా ఇలానే సహకరించాలి' అని కోరారు వరలక్ష్మి

'బడ్డీ' వచ్చేది ఎప్పుడంటే..!




అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న 'బడ్డీ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోనీ దర్శకుడు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు జ్ఞానవేల్ రాజా, అధన చెప్పారు. ఈ చిత్ర నిర్మాణం ఇండియన్ సిల్వర్ స్ర్కీన్ మీద కొత్త ప్రయత్నం అని వారు చెప్పారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాటలు మంచి ఆదరణ పొందాయని చెప్పారు.

టికెట్ రేట్లు తగ్గించాలి



వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా రూపుదిద్దుకున్న 'పేక మేడలు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రె నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్రాన్ని విడుదల చేస్తున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'పెద్ద సినిమాల టికెట్ రేట్లు ఎంత ఉన్నా ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. ఇలాంటి చిన్న సినిమాలకు తక్కువ రేట్లు ఉండాలి. అందుకే టికెట్ రేటు వంద రూపాయలు పెట్టాం. ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని పెయిడ్ ప్రీమియర్స్ కు రూ 50 పెట్టాం. సినిమా బాగుందని ప్రతి ఒక్కరూ చెప్పారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ 'ఈ సినిమా విడుదల చేయడానికి ముందుకు వచ్చిన ధీరజ్‌కు ధన్యవాదాలు. అలాగే మా సినిమాకు సపోర్ట్ చేసిన రానా దగ్గుబాటి, అడవి శేష్, విష్వక్‌సేన్‌కు కృతజ్ఞతలు' అన్నారు. పెయిడ్ ప్రీమియర్స్‌కు వస్తున్న రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా ఉందని వినోద్ కిషన్ చెప్పారు.





ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు హర్షణీయం: కోండ్రు

రాజాం: ల్యాండ్ టైటిలింగ్ చట్టం, శాశ్వత ఉచిత ఇసుక విధానాన్ని మంత్రి మండలి ఆమోదించడం పట్ల రాష్ట్ర ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం ఓ ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నత కాలం శాశ్వతంగా ఉచిత ఇసుక విధానం అమల్లో ఉంటుందని చంద్రబాబునాయుడు స్పష్టం చేయడం చరిత్రాత్మకమన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో జగన్ ఆధ్వర్యంలో వైసీపీ భూమాఫియా దేవాలయాలు, చర్చిలు, వక్ఫ్, అటవీ భూములు, వాగులు, వంకలు కూడా కబ్జాచేసి లేఔట్లు వేసి అమ్మేశారని కోండ్రు ఆరోపించారు

భోగాపురం విమానాశ్రయానికి పీవీజీ రాజు పేరు పెట్టాలి

విజయనగరం రింగురోడ్డు: భోగాపురం విమానాశ్రయానికి డాక్టర్ పీవీజీ రాజు పేరు పెట్టాలని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు భోగాపురపు వాయనందన శర్మ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రింగురోడ్డు సమీపంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, పీవీజీ రాజు ప్రజల కోసం ఎన్నో సంఘ సేవా కార్యక్రమాలు, దేవాలయాలకు, విద్యాలయాలకు, వైద్యాలయాలకు వేల ఎకరాలు భూములను ధారదత్తం చేసిన మహనీయుడన్నారు. మాన్సాస్ ట్రస్టుని స్థాపించి ట్రస్టు పేరిట ఎన్నో సేవా కార్యక్రమాలు నిరంతరం జరిగే విధంగా ఆయన తీసుకున్న నిర్ణయం ముందు చూపుకు నిదర్శనమైందన్నారు. జంధ్యాల బుచ్చిబాబు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీల సభ్యత్వం నమోదు చేసుకోండి

శృంగవరపుకోట: జనసేన క్రియశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు ఒబ్బిన సన్యాసి నాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 18 నుంచి 28 వరకు పార్టీ క్రియశీల సభ్యత్వ నమోదు చేయించాలని అధినేత పవణ్ కల్యాణ్ పిలుపునిచ్చారన్నారు. ఏడాదికి రూ.500 చెల్లించి సభ్యత్వం తీసుకున్నవారికి ప్రమాద సమయంలో రూ.50 వేలు వైద్యఖర్చులు, చనిపోతే కుటుంబానికి రూ.5లక్షలు బీమా ఉంటుందన్నారు.

క్రీడాకారిణికి వితరణ

శృంగవరపుకోట: శృంగవరపుకోట ఫ్రెండ్స్ రీక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న రాష్ట్ర స్థాయి క్రీడాకారిణి పంపాన మౌనికకు బుధవారం ధర్మవరం గ్రామానికి చెందిన కాపుగంటి తాతాజీ రూ.5 వేలు విలువైన బ్యాడ్మింటన్ రాకెట్‌ను బహుకరించారు. అకాడమీ చీఫ్ కోచ్ శ్రీరాములు, కోచ్ అస్లాం ఉన్నారు.

హెల్మెట్ ధారణపై నేడు ర్యాలీ

కొత్తవలస: హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం ఉదయం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించే విషయమై అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్టు కొత్తవలస జూనియర్ సివిల్ న్యాయాధికారి డాక్టర్ ఎస్.విజయచందర్ తెలిపారు. ఈ ర్యాలీ కొత్తవలస కోర్టు నుంచి రైల్వేస్టేషన్ వరకు సాగుతుందని తెలిపారు.

12 గంటలపాటు సంకీర్తన

లక్కవరపుకోట, జూలై 17: లింగంపేట గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం 12 గంటల పాటు శ్రీరామ సంకీర్తన సాగింది. వందలాది మంది మహిళలు రామ నామస్మరణ చేశారు. వీరికి గ్రామ పెద్దలు సహకరించారు.

ఎంబ్రాయిడరీ, ప్రింటింగ్‌పై శిక్షణ

విజయనగరం రూరల్: ఇన్నర్ వీల్ క్లబ్, రోటరీ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో మహిళల కోసం చీరెలపై ఎంబ్రాయిడరీ, ప్రింటింగ్ తదితర వాటిపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు క్లబ్ ప్రతినిధులు జి.శిరీష, ఎం ఐశ్వర్య, కె కల్పన, జి.అస్మిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో నగరంలోని ఉల్లివీధిలో ఉన్న ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. వివరాలకు 95021 68486, 79815 21975, 98660 83729 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జన సైనికుల సంక్షేమమే పవన్ ధ్యేయం

రాజాం: జనసైనికుల సంక్షేమమే అధినేత పవన్ కల్యాణ్ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాపీ రాజు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 28 వరకు జరగనున్న క్రియాశీలక సభ్యత్వ నమోదు మహాయజ్ఞం కార్యక్రమంలో ప్రతి జనసైనికుడు, వీర మహిళలు పాల్గొనాలని కోరారు. సభ్యత్వ నమోదు, రెన్యూవల్ జరిగేలా కృషి చేయాలన్నారు. జనసైనికుల సంక్షేమే లక్ష్యంగా వారి కుటుంబాలకు భరోసా అందించేందుకు పవన్ కల్యాణ్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

విద్యుత్ స్తంభాలతో అప్రమత్తం

బొబ్బిలి, జూలై 17: పట్టణంలోని నాలుగోవార్డులో గల పలు విద్యుత్ స్తంభాలు షాక్‌కొడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసే టప్పుడు ఇనుప విద్యుత్ స్తంభాలు, గోడలు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని అంట్యాకుల వీధి వాసులంతా ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఏదైనా అపాయం జరగక మునుపే విద్యుత్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని వార్డు ప్రజలు గట్టిగా హెచ్చరిస్తున్నారు.

● దీనిపై పట్టణ ఏఈ సాంబశివరావు వివరణ ఇచ్చారు. సమాచారం తెలియగానే విద్యుత్ లైన్‌మాన్‌ను అక్కడికి పంపించి ఆరా తీశామన్నారు. తక్షణం రెక్టిఫై చేస్తామని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగనీయమని తెలిపారు.

కషాయం తయారీపై అవగాహన

వేపాడ, జూలై 17: మండలంలో వావిలపాడు గ్రామంలోని రైతు చెల్లంనాయుడు వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ సాగు విభాగంలో దశ పత్ర కషాయం తయారీపై, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ ఈ కషాయం వల్ల కలిగే ప్రయోజనాలను, లాభాలను రైతులకు వివరించారు. ఒక ట్యాంక్ నీటిలో ఒక లీటర్ దశపత్ర కషాయాన్ని కలిపి పంటలపై పిచికారీ చేయాలన్నారు. తద్వారా పంటపై వచ్చిన చెడు పురుగులను నివారించుకోవచ్చన్నారు. అనంతరం రైతు అప్పలనాయుడు వ్యవసాయ క్షేత్రంలో నవధాన్యాల సాగును అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, ఇన్‌చార్జి రాము, దేముడు, తదితరులు పాల్గొన్నారు.



దశపత్ర కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్, హాజరైన అధికారులు

విజయనగరం క్రైం, జూలై 17: జిల్లాలోని పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఫిర్యాదులు అందించేందుకు వచ్చే మహిళలు, బాధితులతో పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం బుధవారం జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాత్రి పెట్రోలింగు గస్తీ ముమ్మరం చేయాలని, నేరాలను అరికట్టేందుకు అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలన్నారు. సమాచార వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని అక్రమ రవాణాకి పాల్పడే వ్యక్తులను అరెస్టు చేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే రౌడీషీటర్లు, చెడు నడత కలిగే వ్యక్తుల చర్యలపై ఉక్కుపాదం మోపాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. గ్రామాలను సందర్శించి గ్రామంలోని శాంతిభద్రతల సమస్య గురించి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు మహిళల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ఆస్మాపరహీన్, సోల్మాన్, డీఎస్పీలు గోవిందరావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, విశ్వనాథ్, వీరకుమార్, యూనివర్స్‌తో పాటు సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్ఐలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే కళా వెంకటరావు

రాజాం: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. బుధవారం రాజాం క్యాంపు కార్యాలయంలో మెరకముడిదాం మండల ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. చీపురుపల్లి మండలం గొల్లలములగాం పంచాయతీ కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలను కళా వెంకటరావుకు వివరించారు. చీపురుపల్లి నియోజకవర్గ తూర్పుకాపు ఉద్యోగ సంఘ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సంఘ అధ్యక్షుడు గంగుపల్లి సత్యం, ప్రధాన కార్యదర్శి రౌతు రాము, మీసాల చంద్రశేఖర్, కర్రోతు విశ్వేశ్వరరావు. లెంక చిరంజీవి, పీవీ రమణ, ఆల్లి వెంకటమ్మ, మీసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మెరకముడిదాం టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న కళా

చర్చిని ప్రారంభించిన బేబీనాయన



చర్చి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం, జూలై 17: మండల పరిధిలోని జన్నివలసలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన బుధవారం సాయంత్రం చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలకు అతీతంగా అందరూ సోదరభావంతో మెలగాల్సి ఉందని గుర్తు చేశారు. కొంతమంది వ్యక్తులు మతాల పేరిట మారణహోమం సృష్టిస్తున్నారని, మనుషుల మధ్య అగాధం ఏర్పడేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఇలాంటి వ్యక్తులకు అందరం బుద్ధి చెప్పాల న్నారు. బేబీనాయన పేరిట చర్చిలో ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే బేబీనాయన వెంట మండల పార్టీ అధ్యక్షులు వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

మంత్రి సవితను కలిసిన ఎమ్మెల్యే కోళ్ల



మంత్రి సవితతో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి దంపతులు

శృంగవరపుకోట, జూలై 17: అమరావతి తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత శాఖ మంత్రివర్యులు ఎస్.సవితను శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి పనులు, తదితర అంశాలపై చర్చించారు. పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరామప్రసాద్, మాజీ జడ్పీటీసీ కరెండ్ల ఈశ్వరరావు, నాయకులు లాలాం అర్జునరావు, ఏడువాక గణేష్, గోగాడ జగన్నాథం నాయుడు, సాగర్ కల్యాణ్ తదితరులున్నారు.

సమర్థవంతమైన తోడ్పాటుతోనే విజయం

● ఘనంగా ఎస్పీ దీపిక ఆత్మీయ అభినందన సభ



ఎస్పీ దీపిక దంపతులను సత్కరిస్తున్న పోలీసు అధికారులు

విజయనగరం క్రైం: జిల్లాలో తాను పనిచేసిన కాలంలో జిల్లా ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఏర్పడందని అందరి సహకారంతోనే సమర్థవంతమైన తోడ్పాటుతో విధులు విజయ వంతంగా నిర్వహించామని, బదిలీపై వెళ్లిన ఎస్పీ దీపిక అన్నారు. మంగళవారం రాత్రి నగరశివారులోని ఓ పంక్షన్ హాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఎస్పీ దీపికకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సమర్థవంతమైన పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారని వారందరి సహకారంతోనే వీఐపీ పర్యటనలు, సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించామన్నారు. చిన్నప్పటి నుంచి తాను పోలీసులతో కలిసి పెరగటం వల్ల తాను ఎవరితో మాట్లాడుతున్న తన కుటుంబ సభ్యులతోనే మాట్లాడుతున్నట్లు ఉందన్నారు. ఏస్పీకి బదిలీ కావటంతో కొంతమంది అధికారులు భావోద్వేగానికి గురై కన్నీలు పెట్టుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆస్మాపరహీన్, సోల్మన్, డీఎస్పీలు గోవిందరావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, విశ్వనాథ్, వీరకుమార్‌తో పాటు సీ.ఐలు, ఆర్‌ఐలు, ఎస్.ఐలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఏపీపీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు



మైనింగ్ యాజమాన్యాన్ని అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

తెర్లాం: మండలంలో డి. గదబవలసలో అక్రమ మైనింగ్‌ను రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. బుధవారం దీనికి సంబంధించి గ్రామస్థుల నుంచి సమాచారం అందుకున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి ఆదేశాలు జారీ చేయడంతో రెవెన్యూ అధికారులు అప్పలరాజు, వీఆర్వో రామయ్య సర్పంచ్ రమేష్‌నాయుడు తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని మైనింగ్ చేపడుతున్న ఓ ప్రైవేటు కంపెనీ యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు. అనుమతులు చూపించాలని వారిని కోరారు. వారి వద్ద సరైన పత్రాలు లేనందున పనులు ప్రారంభించడానికి వీలు లేదని హెచ్చరించారు. దిక్కరిస్తే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వీరితో పాటు హెడ్ కానిస్టేబుళ్లు పీవీఎన్ అప్పలరాజు, రాజు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ వకుల్ జిందాల్

కలెక్టరేట్: జిల్లా కలెక్టరు డాక్టరు బీఆర్ అంబేద్కర్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కలిశారు. జిల్లాఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన వకుల్ జిందాల్, కలెక్టరు క్యాంపు కార్యాలయంలో కలెక్టరును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం జిల్లాలోని పరిస్థితులు పై ఇరువురు చర్చించారు.

నూతన ఎస్పీకి కేసలి శుభాకాంక్షలు

విజయనగరం క్రైం: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వకుల్ జిందాల్‌కు బుధవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను బాల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల సమన్వయంతో కృషి చేద్దామని తెలిపారు.

ఏబీ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

విజయనగరం దాసన్నపేట: జిల్లాలో నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఏబీ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రస్టు ఫౌండర్ ఎస్.స్వరూప్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న పవన్‌కుమార్‌కు రూ.10 వేలు, నిరుపేద విద్యార్థికి రూ.10 వేలు, లక్ష్మీ అనే పేద విద్యార్థినికి రూ.10 వేలు, అనాథ పిల్లల వసతి గృహానికి నిత్యావసర సరుకులకు రూ.20 వేలు సాయం అందించారు.

ఉపాధి కూలీలు ఎలా బతకాలి?



రైతులతో నిరసన తెలుపుతున్న గాడి

లక్కవరపుకోట: మండలంలోని ఉపాధి కూలీలకు పది నెలల నుంచి బిల్లులు రాలేదని, వారి కుటుంబాలు ఎలా బతకాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు గాడి అప్పారావు ప్రశ్నించారు. బుధవారం రైతులతో కలిసి ఎల్.కోట మండల కేంద్రంలో నిరసన తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తున్నా ఉపాధి పనులపై ఎటువంటి ప్రకటనలు లేవని విమర్శించారు. ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి ఒప్పించాలని కోరారు. కౌలు రైతులకు ఎటువంటి హామీలు లేకుండా బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరారు. మాన్సాస్, దేవాదాయ, ఇనాం భూముల సాగు చేస్తున్న వారికి రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తరిణి వెంకటరమణ, చిన్నారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి



జగన్నాథ చెరువులో వేసిన రోడ్డును పరిశీలిస్తున్న వైఎస్ ఎంపీపీ

శృంగవరపుకోట రూరల్: ముషిడిపల్లి పంచాయతీలో చెరువులు, డీపట్టా భూములు ఆక్ర మించుకున్నా.. అప్పటి ప్రభుత్వంలో అధికారులు పట్టనట్లు వ్యవహ రించారని.. ఇప్పటికైనా వాటిని తొలగించాలని వైస్ ఎంపీపీ, ముషిడిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు ఇందుకూరి సుధారాజు కోరారు. బుధవారం స్థానిక పంచాయతీ ఉప సర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు, పంచాయతీ పెద్దలు, ఆయకట్టు రైతులతో కలిసి జగన్నాథ చెరువులో ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం సుధారాజు విలేకరులతో మట్లాడుతూ గత ప్రభుత్వంలో అధికారంలో ఉన్నవారు అతిపెద్ద లేఅవుట్‌ను వేసి దురాగతాలకు పాల్పడ్డారన్నారు. వాటిని తొలగించాలని కోరుతూ అప్పట్లో కలెక్టర్, డీపీవో, మండల స్థాయి అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం మరోసారి కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు.

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఎన్నిక

బొబ్బిలి, జూలై 17: బొబ్బిలి ఎన్‌జీవో హోంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు జామి చినప్పన్న ఆధ్వర్యంలో జరిగిన జిల్లా తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన 45 మంది ఉద్యోగులు చేరారు. వీరంతా ఏపీఈఈ యూనియన్ 327 నుంచి తెలుగునాడు సంఘంలో చేరినట్లు ప్రకటించారు. వీరిలో లైన్‌మ్యాన్ బి.తేజేశ్వరరావు, పెంట భాస్కరరావు, లోచర్ల అప్పలస్వామి, ఎల్లంనాయుడు, శీతన్న, వాసు తదితర 12 మంది లైన్‌మ్యాన్లు, 15 మంది ఏఎల్ఎంలు, 18 మంది ఎనర్జీ అసిస్టెంట్లు, షిఫ్టు ఆపరేటర్లు, కంప్యూటరు ఆపరేటర్లు ఉన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో జిల్లా తెలుగునాడు విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా బి.తేజేశ్వరరావు, కోటిపల్లి జయరాం, కోశాధికారిగా గుత్తావల్లి మోహనరావు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా జామి చినప్పన్న, జిల్లా సహాయ కార్యదర్శిగా డి.శివకృష్ణ, ఉపాధ్యక్షునిగా జీవన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జిల్లా తెలుగునాడు కార్యదర్శి కోటిపల్లి జయరాం ఏపీఈపీడీసీఎల్ అధ్యక్షుడు ఎం.నాయుడు, ఆర్ఆర్‌మూర్తి, ఎం.గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్మిక సంఘంలో చేరిన వారితో నాయకులు

నేటి నుంచి కుష్ఠువ్యాధి సర్వే

● జిల్లా వ్యాప్తంగా 1790 బృందాలు ఏర్పాటు

● కలెక్టర్ అంబేడ్కర్



అంబేడ్కర్

కలెక్టరేట్, జూలై 17: జిల్లాలోని కుష్ఠువ్యాధి రహిత జిల్లాగా మార్చు చేసేందుకు గురువారం నుంచి ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఇంటింటా సర్వే చేయనున్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 నుంచి వచ్చే నెల 2 తేదీ వరకూ సర్వే జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్ళి ఎవరైనా కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉంటే నమోదు చేసుకుంటారని, దీనికి జిల్లా వ్యాప్తంగా 1790 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బృందంలో ఒక ఆశా వర్కర్ లేదా ఏఎన్ఎం ఉంటారని తెలిపారు. ఈ వ్యాధిని గుర్తించడం వల్ల సకాలంలోని ఎండిటి చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయడం వీలుందని, అలాగే ఈ వ్యాధిని కూడా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యాధిగ్రస్తులకు అంగవైకల్యం బారి నుంచి కాపాడవచ్చని, మైక్రో బాక్టరియం లెప్రే అన్న బాక్టీరియా ఈ వ్యాధికి కారణం అని, తుంపర్లు ద్వారా ఒకరి నుంచి మరొకరికి ఈ బాక్టీరియా వ్యాప్తి చెందుతుందని, వారి వ్యాధి నిరోధకత శక్తిని బట్టి వ్యాధి లక్షణాలు బయట పడేందుకు 3 నుంచి 8 సంవత్సరాలు పడుతుందని తెలిపారు.

రెండుకు పెరిగిన మృతుల సంఖ్య

● ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమం

మెంటాడ: మండలంలోని రాబంద- మీసాలపేట గ్రామాల మధ్య ఈనెల 15న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య రెండుకి పెరిగింది. ఈ ప్రమాదంలో కెల్ల సామమ్మ అనే వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడి విజయనగరం కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న నలుగురిలో కోరాడ రాములప్పమ్మ (73) అనే మహిళ బుధవారం మృతి చెందినట్టు ఎస్ఐ దేవి తెలిపారు. మిగిలిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు తెలుస్తోంది. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అట్టాడ అప్పలకొండ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. గజపతినగరం సీహెచ్ సీలో చికిత్స పొందిన వారిలో కొందరిని డిశ్చార్జ్ చేసినట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

భూ వివాదం వల్లే మహిళ హత్య

పోలీసులకు పట్టుబడిన నిందితుడు



మాట్లాడుతున్న సీఐ రవికుమార్

సీతానగరం (బలిజిపేట): బలిజిపేట మండలంలో గంగాడ గ్రామానికి చెందిన సావిత్రమ్మ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. భూ క్రయ విక్రయాలకు సంబంధించి తగాదాల నేపథ్యంలో హత్య జరిగినట్లు దర్యాప్తులో నిర్ధారించారు. సీఐ రవికుమార్ బుధవారం వివరాలను వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. సావిత్రమ్మ కనిపించడం లేదని ఈనెల 12న కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈనెల 14న రామన్న చెరువులో సావిత్రమ్మ మృతదేహాన్ని గుర్తించారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి శవ పంచనామా నిమిత్తం పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. పంచనామాలో వైద్యులు నివేదిక ఆధారంగా హత్యగా గుర్తించారు. అనుమానాస్పద మృతి హత్యకేసుగా మార్చి దర్యాప్తు చేస్తుండగా సావిత్రమ్మ మరిది గంగాడు వీఆర్వో వద్ద లొంగిపోయాడు. గంగాడుతో కలిసి మృతదేహం లభించిన చోట పోలీసులు దర్యాప్తుచేశారు. ఈనెల 12న పొలం మార్గమధ్యలో తగాదపడి కర్రతో తలపై బలంగా కొట్టడంతో ఆమె మృతి చెందడంతో మృతదేహనిన కొండపై గుండం వద్ద పడేసినట్లు దర్యాప్తులో తేలింది. అనుమానం వచ్చి ఈనెల 14న వేకువజామున కొండపై నుంచి మృతదేహన్ని తీసుకొచ్చి చెరువులో పడేశాడు. ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు కుటుంబ సభ్యులతో పాటు వెతకసాగాడు. హత్యగా గుర్తించిన తర్వాత నుంచి పరారీలో ఉన్నాడు. బుధవారం గంగాడును అదుపులోకి తీసుకుని పార్వతీపురం న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. దర్యాప్తులో ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

కొమరాడ: అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గుర్ని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. రాయగడ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న వాహనంలో తనిఖీ చేయగా, నక్క బాలరాజు, సింధు శివల వద్ద నాలుగు మద్యం సీసాలు లభ్యం కావడంతో ఇద్దరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే పార్వతీపురం నుంచి సోమినాయుడువలస గ్రామం వైపు వాహనంపై కింతలి సుధాకర్ ఏడు మద్యం బాటిళ్లు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అర్తాం వద్ద జరిపిన తనిఖీల్లో ఆయన పట్టుబడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

పేదల డాక్టర్ సత్యారావు మృతి



సత్యారావు (ఫైల్)

బొబ్బిలి, జూలై 17: గత ఏడు దశాబ్దాలుగా బొబ్బిలి పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో పేదలకు ఉచిత వైద్యం చేస్తూ పేదల డాక్టర్‌గా పేరొందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ రెడ్డి సత్యారావు(85) ఈనెల 16న రాత్రి విశాఖలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, రైల్వేబోర్డు విశాఖజోన్ యూజర్స్ కమిటి సభ్యుడిగా, జిల్లా టెలికం బోర్డు సభ్యుడిగా పలు పదవులు నిర్వహించారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా బీజేపీ తరపున పోటీచేశారు. ఈయనకు నలుగురు కుమారులున్నారు. వారంతా వైద్యులే. ఈనెల 18న బొబ్బిలిలోని గొల్లవీధి స్మశానవాటికలో సత్యారావు అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వసతి గృహాల సందర్శనలో ఏఐఎస్ఎఫ్ఐ

విజయనగరం దాసన్నపేట: వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 20 నుంచి 30 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులతో ముఖాముఖి, నిద్రలు నిర్వహిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫణీంద్ర కుమార్ వెల్లడించారు. బుధవారం అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వసతి గృహాల సందర్శన ద్వారా విద్యార్థుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఆగస్టు 6న కలెక్టరేట్ ఎదుట శాంతియుత నిరసనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు నాగభూషణ్, సాయి, జగదీష్, బాబ్జీ, గౌరీశంకర్, సుమంత్, జ్యోతి, భాను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

రాజాం: గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనాలు తక్షణం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రెయ్యి రామకృష్ణ, శంకర్ తదితరులు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. మే 14 నుంచి జూన్ 7 వరకు పనిచేసిన వారికి వేతనాలు రాలేదని, వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శీనివాసరావు వారికి హామీ ఇచ్చారు. తమ కాలనీలో పాఠశాల వంటగది పూర్తిగా శిథిలమైందని ఎంఈఓ ప్రవీణ్‌కుమార్‌కు ఎస్సీ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.

ఎరుకులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఏకలవ్య విగ్రహావిష్కరణ దృశ్యం

కొత్తవలస, జూలై 17: ఎరుకుల సామాజిక వర్గానికి సంబంధించి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ వర్గం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఏకలవ్య జయంతి సందర్భంగా బుధవారం చింతలదిమ్మ గ్రామంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహాన్ని ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. నకిలీ ఎరుకుల ధువ పత్రాలను రద్దు చేయాలని, చట్టపరంగా కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాలవలస శ్రీను, పాలవలస పైడితల్లి, గొర్లె సత్యవతి, గేదెల లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దోపిడీని తెలియజేసేందుకే శ్వేతపత్రాలు

● కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



జియ్యమ్మవలస : టీఎన్‌వలసలో జరిగిన విజయోత్సవ ర్యాలీలో జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: వైసీపీ ఐదేళ్ల పాలనలో సహజవనరుల దోపిడీపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకే ప్రభుత్వం శ్వేత పత్రాలు విడుదల చేస్తోందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలకులు ఏ విధంగా అక్రమాలు, దందాలు చేశారో, ఎంత దోచుకున్నారో ఆధారాలతో సహా శ్వేతపత్రాలు ద్వారా బయట పడనున్నాయన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో వైసీపీ నేతలు భూదోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఇళ్ల పట్టాల్లో వైసీపీ నేతలు ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, వీరి దగ్గర నుంచి ప్రతి రూపాయి వసూలు చేసి ప్రజా ఖజానాకు జమకడతామన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసి నూతన ఇసుక విధానం పేరుతో భవన నిర్మాణ రంగాన్ని జగన్‌రెడ్డి ప్రభుత్వం కుప్పకూల్చిందన్నారు. హౌసింగ్ కాలనీలు ఎక్కడ రావాలో వైసీపీ నేతలే నిర్ణయించేవారని, అందుకు ముందే స్థలం కొని తిరిగి ప్రభుత్వానికి అధిక ధరలకు అమ్మేశారన్నారు. సమావేశంలో మండల తెలుగుదేశం కన్వీనర్ పాడి సుధా పాల్గొన్నారు.

సమస్యలపై అర్చకుల వినతి

గుమ్మలక్ష్మీపురం కైలాసనాథ దేవాలయంలో నిర్వహించిన కార్య క్రమంలో తమ సమస్యలు పరిష్కరించాలని వినతిప త్రం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి అర్చకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరికి ఆశీర్వదించారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు కడాయి సొంటేను, రాజేష్ పాల్గొన్నారు.

జియ్యమ్మవలసను అభివృద్ధి చేస్తా

జియ్యమ్మవలస : జియ్యమ్మవలస మండలాన్ని అభివృద్ధి చేస్తానని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం మండలంలో తురక నాయుడువలసలో ఎంపీపీ బొంగు సురేష్, అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, టీడీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జియ్యమ్మవలస మండలం ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీ అందించారన్నారు. తురకనాయుడువలస ప్రధాన రహదారికి నిధులు మంజూరు చేసి రోడ్డు వేయిస్తానన్నారు. గ్రామానికి 40 వేల లీటర్ల రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేస్తానన్నారు.

నేడు బీటీ రోడ్డు ప్రారంభం

కురుపాం: ఉపాధి నిధులతో సీతంపేటకు నిర్మించిన బీటీ రోడ్డును గురువారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పారంభించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య తెలిపారు. కోనగూడ రోడ్డు కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు.

నారాయణరావు మృతి తీరని లోటు: జయకృష్ణ



నారాయణరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జయకృష్ణ, జ్యోతులనెహ్రూ

పాలకొండ: టీడీపీ నాయకులు కరణం నారాయణరావు మృతి తీరని లోటని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. నారాయణరావు దహన సంస్కారాలు మండలంలోని కొండాపురం గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే జయకృష్ణతో పాటు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారాయణరావు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. పరామర్శించిన వారిలో టీడీపీ రా ష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి, నాయకులు పల్లా కొండలరావు, పార్టీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, బూర్జ మాజీ జెడ్పీటీసీ ఆనెపు రామకృష, మాజీ జెడ్పీటీసీ సామంతుల దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఈవో

పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను శ్రీకాకుళం జిల్లా కేం ద్ర సహకార బ్యాంక్ సీఈవో డి.వర ప్రసాద్, వీరఘట్టం డీసీసీబీ బ్రాంచి మేనేజర్ ఎస్.పార్వతి, ప్యాక్స్ సీఈవో బి.పైడిరాజు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

హెడ్ కానిస్టేబుల్ మృతికి సంతాపం

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ బిడ్డిక బుదర అ స్వగ్రామం వంగర గ్రామంలో మృతి చెందాడు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన మృతికి ఎల్విన్‌పేట పోలీస్ సిబ్బంది సంతాపం తెలిపారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి

● జీవ వైవిధ్య రీజినల్ కోఆర్డినేటర్ జానకీరామ్



మాట్లాడుతున్న జానకీరామ్

గరుగుబిల్లి: జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జీవ వైవిధ్య రీజినల్ కోఆర్డినేటర్ జానకీరామ్ సూచించారు. బుధవారం తోటపల్లి జట్టు నూతన భవన ప్రాంగణంలో వ్యవస్థాపకుడు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన ప్రత్యేక కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవ వైవిధ్యం కాపాడే పలు విధానాలపై పూర్తిస్థాయిలో ప్రభుత్వపరంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు జీవ వైవిధ్యాన్ని కాపాడే పలు అంశాలను నేర్పిస్తే భవిష్యత్‌లో ప్రకృతిని సంరక్షించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. చిన్ననాటి నుంచే విద్యార్థులకు జీవ వైవిధ్యం కాపాడే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. రసాయన ఎరువులు వినియోగం తగ్గించి సేంద్రియ విధానాలను అమలు చేస్తే రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రచయితలు బి.భీమేశ్వరరావు, టి.శివాజీ, ఆర్.వాసుదేవరావు, టి.శివకేశవరావు, ఎల్.వెంకటస్వామి, పి.రవీంద్రనాథ్, బీవీ పట్నాయక్, కె.దాలినాయుడు, పి.గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాయగడ: కళ్యాణసింగుపూర్ సమితి శికరపాయి పంచాయతీలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్యామ్‌కులసిక(27) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. శికరపాయి పరిధి బేజాపూర్ గ్రామానికి చెందిన శ్యామ్‌కులసిక తన మోటరుసైకిల్‌పై నారాయణపూర్ పంచాయతీ పండరపాడు మీదుగా వెళ్తున్నాడు. అదే సమయంలో శికరపాయి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు సాయంత్రం నడకకు బయలుదేరారు. వారిలో దేవాన్స్‌ను వెనుక నుంచి శ్యామ్‌కులసిక బైక్ ఢీ కొనడంతో అదుపుతప్పి శ్యామ్ కిందపడడంతో తలకు తీవ్రగాయమై ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. దేవాన్స్ గాయపడడంతో జిల్లా ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెసుకున్న పోలీసు అధికారి నీలకంఠ బెహర మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి దంపతులకు గాయాలు

రాయగడ: ఒక రైలుకు బదులు మరో రైలు ఎక్కి కదులుతున్న సమయంలో దిగడంతో దంపతులకు గాయాలైన ఘటన టికిరి సమితి సింగారం రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వేగవర్నమెంట్ పోలీసుల కథనం మేరకు.. లక్ష్మీపూర్ సమితి ఒడియపాత్ పంచాయతీ ఖారగుడ గ్రామానికి చెందిన ఝూలిరాం కాశీ, ఆయన భార్య మాలతీకాశీలు టికిరిలో పనికోసం వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేందుకు టికిరి రైల్వేస్టేషన్‌లో కొరాపుట్-విశాఖ రైలుకోసం ఎదురుచూస్తున్నారు. ఆ సమ యంలో రాయగడ నుంచి జగదల్‌పూర్ వెళ్తున్న రైలు రావడంతో అదే తాము ఎక్కవలసిన రైలు అనుకుని ఎక్కారు. తీరా రైలు సింగారం స్టేషన్‌కు చేరుకునే సరికి తాము ఎక్కవలసిన రైలు ఇది కాదనుకుని తెలుసుకుని కదులుతున్న రైలు దిగబోయి జారిపడ్డారు. తీవ్రంగా వారిద్దరూ గాయపడడంతో రైల్వే సిబ్బంది, బంధువులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందజేస్తున్నారు.

నిర్వహణ లేక.. మరమ్మతుకు నోచుకోక

● శిథిలావస్థకు చేరి కూలిపోతున్న వైనం ● ఇదీ తోటపల్లి ఎడమ కాలువపై ఆనకట్ట రక్షణ గోడ పరిస్థితి

గరుగుబిల్లి: బ్రిటీష్‌పాలకుల కాలంలో నిర్మించిన తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ వైపు ఉన్న ఆనకట్ట రక్షణ గోడ పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకుంది. రక్షణ గోడ క్రమేణా కూలిపోతున్నా కనీస మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఈ నేపథ్యంలో పలుసార్లు పార్వతీపురం నుంచి జియ్యమ్మవలస,కురుపాం, గుమ్మలక్ష్మీపురంవైపు వెళ్లేబస్సులు ప్రమాదాల బారినపడిన విషయం విదితమే.వైసీపీ హయాంలో కనీసనిర్వహణ పనులకు సైతం నోచుకోలేదని పలువురు ప్రయాణికులు, వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఆనకట్టకు ఏ మాత్రం ప్రమాదం వాటిల్లినా అంతర్రాష్ట్రాలకు రాకపోకలు నిలిచే అవకాశముందన్న ఆందోళన వ్యక్తముంది. ఈ మార్గంలో చత్తీస్‌ఘడ్, ఒడిశాకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగి స్తుంటాయి. గతంలో ఆనకట్ట రక్షణ గోడకు సమీపంలో గల మలుపు వద్ద పలువురు మృత్యువాతపడిన విషయంవిదితమే. అధికారులు దృష్టి సారించి ప్రమాదాల జరగకుండా చర్యలు తీసుకోవాలని, శిథిలావస్థకు చేరి వంతెన రక్షణ గోడను తాత్కాలికంగానైనా మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కూలిపోతున్న ఆనకట్ట రక్షణ గోడ

ధరల నియంత్రణకు కదిలిన యంత్రాంగం

● దుకాణాల్లో రెవెన్యూ అధికారులు దాడులు

● నిత్యావసర సరుకుల కోసం ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు



గరుగుబిల్లి :కందిపప్పు అందజేస్తున్న సిబ్బంది



కురుపాం: ప్రత్యేక కౌంటర్‌లో కంది పప్పు అందజేస్తున్న అధికారులు



సీతంపేట: కందిపప్పు స్టాల్ ఏర్పాటు చేసిన తహసీల్దార్ సోమేశ్వరరావు

నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు ప్రభుత్వం యంత్రాంగం కదిలింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం కిరాణా, హోల్‌సేల్ దుకాణాల్లో దాడులు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని నిర్వాహకులు అధికారులు ఆదేశించారు. ధరల పట్టికను వేలాడదీయాలని స్పష్టం చేశారు. నిత్యావసర సరుకులు ధరలు పెరిగిన నేపథ్యంలో దీనిని ఆసరాగా చేసుకొని వ్యాపారులు అధిక ధరలకు బియ్యం, కందిపప్పు వి క్రయిస్తున్నారు. దీంతో పౌరసరఫరాల శాఖ బియ్యం, కందిపప్పు ధరలు నిర్ణయిస్తూ చర్యలు తీసుకుంది. ఆ ధరలకే అమ్మకాలు చేపట్టాలని, లేనిపక్షంలో వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా ప్రభుత్వం నిర్ధారించిన ధరకు సరుకులు వి క్రయించేందుకు మండలకేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు.

నిర్ణయించిన ధరలకే విక్రయించాలి..

వీరఘట్టం: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులు విక్రయించాలని తహసీల్దార్ కె.జయప్రకాష్ కోరారు. బుధవారం వీరఘట్టంలోని కిరాణా, హోల్‌సేల్ షాపులను సంద ర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు సరైన ధరల్లో నాణ్యమైన సరుకులు అమ్మకంకోసం ధరలు నిర్ణయించిందని చెప్పారు. కందిపప్పు కేజీ 181 రూపాయలు ఉండగా రూ.160కు అమ్మాలని స్టీమ్డ్-బీపీటీ/సోనామసూరి బియ్యం కేజీ రూ.55.85 ఉండగా, రూ.49కు అమ్మాలని, పచ్చి బీపీటీ/సోనామసూరి బియ్యంకేజీ రూ.52.40 ఉం డగా రూ. 48కు అమ్మాలని వ్యాపారులు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల బోర్డును షాపుల వద్ద వేలాడదీశారు. కార్యక్రమంలో వీఆర్వో రాజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



వీరఘట్టం:షాపులో సరుకులను పరిశీలిస్తున్న జయప్రకాష్



భామిని: సరుకులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు..

సీతంపేట: అధిక ధరలకు సరుకులు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సోమేశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు సీతంపేటలో వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అతిక్రమించి అమ్మకాలు చేసినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వ్యాపారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్య క్రమంలో సీఎస్‌డీటీ మధుసూదనరావు,ఆర్‌ఐ వెంకటేష్, నియోజకవర్గం ఐటీడీపీ కో-ఆర్డినేటర్ హిమరిక పవన్, టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు సవర తోట ముఖలింగం, మండంగి విశ్వనాధం పాల్గొన్నారు.

సరుకులకు ప్రత్యేక కౌంటర్

కురుపాం: బియ్యం, కందిపప్పు ధరలు అధికంగా ఉండడంతో ధరలు నియంత్రణ, నాణ్యమైన సరుకులు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కురుపాంలోని రావాడ రోడ్డులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసింది. ఇక్కడ బియ్యం, కంది పప్పు అమ్మకాలు కోసం ప్రత్యేక కౌంటర్‌ను తహసీల్దార్ డీఎస్ఎస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, టీడీపీ నాయకులు కర్రి శ్రీనివాసరావు, పి.సురేష్, వీఆర్వో మహేంద్ర పాల్గొన్నారు.

గుర్తింపు పొందిన దుకాణాల్లో కొనుగోలు చేయాలి..

గరుగుబిల్లి: నిత్యావసర వస్తువులను అధిక ధరలకు అమ్మకం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కె.జయ హెచ్చరించారు. గరుగుబిల్లిలో ప్రభుత్వం నిర్ధారించిన ధరలకు కందిపప్పు, సాంబ, స్వర్ణ మసూరీ బియ్యం కౌంటర్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన సరకులను గుర్తింపు పొందిన దుకాణాల నుంచి కొనుగోలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ఇందుమతి, ఆర్‌ఐ ఎం.కృష్ణ, వీఆర్వో నాగరాజు, చిరంజీవి, సూర్యనారాయణతో పాటు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి యడ్ల శ్రీనివాసరావు, కె.గోవిందరావులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

సీతానగరం: సీతానగరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయించే స్టాక్ పాయింట్‌ను ఆర్‌ఐ శ్రీనివాసరావు, సీఎస్‌డీటీ రమేష్‌లు బుధవారం పరిశీలించారు. అంబికా స్టోర్స్ వద్ద బియ్యం, కందిపప్పును ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయానికి ఏర్పాట్లు పరిశీలించినట్లు తెలిపారు.

రాయితీపై సరుకులు..

భామిని: రాయితీపై నిత్యావసర సరుకులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. భామినిలో సివిల్ సప్లై ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల దుకాణాన్ని ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో సివిల్ సప్లై డీటీ మధుసూదనరావు, డీటీ రాజశేఖర్, విఆర్‌వో వెంకటరావు, నాయకులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: బారులు తీరిన భక్తులు



వీరఘట్టం: సోమేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు

● తెల్లవారుజాము నుంచే బారులుతీరిన భక్తులు

జిల్లాలో బుధవారం తొలి ఏకాదశి పురస్కరించుకుని భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో బారులు తీరారు. ఆలయ కమిటీ నిర్వాహకులు బారికేడ్లు ఏర్పాటుచేశారు.

● **వీరఘట్టం:** మండలంలోని పలుగ్రామాల్లో తొలి ఏకాదశి పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరఘట్టంలోని తెలగవీధిలో గల సోమేశ్వరాలయంలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భజన కార్య క్రమం ఏర్పాటు చేశారు.

● **పార్వతీపురంటౌన్:** పార్వతీపురంలోని రమా సత్యనారాయణ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి దర్శనానికి భక్తులు బారులు తీరారు. రమాసత్య నారాయణకు అభిషేకాలు చేశారు. ఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బెలగాం శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు.

నాగూరులో రేగాలమ్మతల్లి పండుగ

గరుగుబిల్లి : మండలంలోని నాగూరులో బుధవారం రేగాలమ్మతల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా వరి ఉభాలు చేపట్టే ముందు నాగూరులో మంగళ, బుధవారాలను నిర్వహిస్తుంటారు. బుధవారం అనుపు పండుగ పురస్కరించుకుని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఘటాలు ఊరేగించి సమయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఘటాలకు సర్పంచ్ కేతిరెడ్డిశిరీష, చంద్రశేఖరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కేతిరెడ్డి కూర్మినాయుడు, కె.అచ్యుతరావు, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని అమ్మవారి ఆలయం వద్దకు వెళ్లి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

మొరాయించిన 108 అంబులెన్స్

సీతంపేట: సీతంపేటకు చెందిన వ్యక్తి పాలకొండ ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్‌కు తీసుకెళ్లేందుకు బుధవారం ఉదయం బూర్జ మండలానికి చెందిన 108 అంబులెన్స్ సీతంపేట వచ్చింది. దోనుబాయి జంక్షన్ మలుపు తిప్పుతుండగా వీల్‌బేరింగ్ మరమ్మతులకు గురికావడంతో 108 వాహనం నిలిచిపోయింది. దీనితో ఆ వాహనాన్ని అక్కడ నిలిపివేసి వేరే అంబులెన్స్‌లో రోగిని తీసుకెళ్లారు. దీనితో రోగి ఇబ్బందులు పడుతూ డయాలసిస్‌కు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. 108 వాహనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం , కొన్ని సందర్భాల్లో రోగులను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నిలిచిపోయిన సందర్భాలు ఉంటున్నాయి. ఈ విషయమై 108 సిబ్బంది వద్ద ప్రస్తావించగా డయాలసిస్ పేషెంట్ కోసం వచ్చామని, బేరింగ్‌లు ఊడిపోవడంతో వాహనాన్ని నిలిపి వేశామని తెలిపారు.

పాఠశాల ప్రహరీ నేలమట్టం



నేలమట్టమైన ప్రహరీ

భామిని: భామిని జడ్పీ పాఠశాలలో మిగిలిన ఉన్న ప్రహరీ మంగళవారం రాత్రి నేలమట్టమైంది. మూడేళ్ల కిందట అక్కడక్కడ ప్రహరీ విరిగిపడింది. ప్రహరీ నిర్మాణానికి పాఠశాల హెచ్‌ఎం వెంకటరావ ప్రయత్నాలు చేశారు. నాడు-నేడు, ఉపాధి హామీ పథకంలో కూడా ఏర్పాటు చేయాలని అధికారులకు లేఖలు రాశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది వెదురు కర్రలతో దడి ఏర్పాటు చేశారు. అయితే మిగిలి ఉన్న ప్రహరీ పూర్తిగా నేలమట్టం కావడంతో పశువులు, విషజంతువులు పాఠశాల మైదానంలోకి ప్రవేశిస్తాయేమోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రహరీ నిర్మించాలని విద్యారుల తల్లిదం డ్రులు కోరుతున్నారు.

ఘనంగా మలయాళ స్వాముల పుణ్యారాధన



ధార్మిక ఉపన్యాసం ఇస్తున్న స్వామిజీ

వీరఘట్టం: పట్టణంలోని శ్రీశాంతి ఆశ్రమంలో బుధవారం సద్గురు మలయాళ స్వాముల పుణ్యారాధన ఉత్సవం, చిదానందగిరి స్వాముల ఆరో పుణ్యారాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ ఆధ్వర్యంలో హోమం చేశారు. కార్యక్రమంలో బైలురు యోగేష్ ప్రభు, తారకానందగిరి, నిత్య స్మరణానందగిరి, కర్రి గోపన్న, లక్ష్మీనారాయణ, కామేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఏఎస్పీ

సాలూరు: రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ, మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని సాలూరులోని తన నివాసంలో ఏఎస్పీ సునీల్ షరోన్ మర్యాదపూ ర్వకంగా బుధవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు.

అటవీ ఉత్పత్తులపై మహిళా రైతులకు శిక్షణ

సీతంపేట: అటవీ ఉత్పత్తులతో విలువ ఆధారిత వస్తువుల తయారీపై మహిళా రైతులకు శిక్షణ వినియోగించుకోవాలని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ నాబార్డు సహకారంతో శిక్షణను పరిశీలించారు. కార్య క్రమంలో ఆర్‌ఐ వెంకటేష్, ఐటీడీపీ ఇన్‌చార్జి హిమరిక పవన్, సవర తోటముఖలింగం, ఆరిక గౌతమి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాలకొండ: పట్టణంలోని మణిరత్నంఫిల్లింగ్ స్టేషన్‌లో పా లకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది పంపు ఆపరేటర్లకు అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగా హన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జా గ్రత్తలను అగ్నిమాపక నిరోధక పరికరాలతో చేసి చూపించారు. ప్రమాదాలు జరిగినప్పుడు 101కు లేదా 08941-260111 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంప్ ఆపరేటర్లు రవి, ఆనంద్, విజయ్, రామారావు పాల్గొన్నారు.

సాలూరు-మక్కువ రోడ్డుకు మరమ్మతులు

సాలూరు: సాలూరు- మక్కువ రోడ్డుకు ఎట్టకే లకు బుధవారం మర మ్మతులు నిర్వహించారు. సుమారు రూ.56 కోట్లతో మూడేళ్ల కిందట మొద లు పెట్టిన సాలూరు నుంచి మక్కువ తారు రోడ్డు పనులకు సంబంధించి రూ. నాలుగు కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఈ నేపథ్యంలో కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంబదింత అధికారులు మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో సమావేశమ య్యారు. దీంతో తక్షణమే సాలూరు- మక్కువ రోడ్డుకు మర మ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సదరు కాంట్రాక్టరు బుధవారం మరమ్మతులు చేపట్టారు.

సభ్యత్వ నమోదు ఉద్యమంలా సాగాలి

గజపతినగరం: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ఉద్యమంలా సాగాలని ఆ పార్టీ పీఏసీ సభ్యురాలు, మాజీ మంత్రి పడాల అరుణ కోరారు. బుధవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో లక్షలా ది మంది సభ్యత్వ నమోదు చేసుకోవడం పవన్ కల్యాణ్‌పై ఉన్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించాలి

రేగిడి: కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు సంబంధించి ఈనెల 18నుంచి ఆగస్టు 2 వరకు గ్రామాల్లో నిర్వహించనున్న సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని బూరాడ పీహెచ్‌సీ వైద్యు లు డాక్టర్ చలమయ్య, రీనాచౌదరి సూచించారు. పీహెచ్‌సీలో బుధవారం ఆశా, ఆరోగ్య కార్య కర్తలతో సర్వే ప్రక్రియపై అవగాహన సమావేశం నిర్వహించారు.